# జ్యోతిష్యము శాస్త్రము - వాస్తు అశాస్త్రము

ఆరుశాస్త్రములలో ఐదున్నొకటి అని పూర్వము నుండి అనుట జరుగుచున్నది. ఐదు మానవునకు సంబంధించినవికాగ ఒక్కటి దేవునికి సంబంధించిన శాస్త్రము. దేవునికి సంబంధించిన దానిని దేవుడే చెప్పగలడు. ఇక మిగిలియున్న ఐదు శాస్త్రములలోను ఏ శాస్త్రమును కూడ పూర్తి మనము తెలుసుకోలేదు. కొన్ని శాస్త్రములోను శాస్త్రపరిశోధకులు ఎడతెరిపి లేకుండ పరిశోధనలు చేయుచునే ఉన్నారు. అప్పుడప్పుడు ఏదో ఒక శాస్త్రములో ఏదో ఒక సిద్ధాంతాన్ని కనుగొనుచునే ఉన్నారు. కాని ఒక్క జ్యోతిష్యశాస్త్రమును కొందరు శాస్త్రమేకాదంటున్నారు, కొందరు శాస్త్రమంటున్నారు. ఎవరు ఒప్పుకొన్న ఎవరు ఒప్పుకోక పోయిన జ్యోతిష్యశాస్త్రము ఆరుశాస్త్రములలో ఒక్కటియై ఉన్నది. జ్యోతిష్యశాస్త్రములో ఏదో పూర్వము కొందరు కనుగొన్న కొన్ని సిద్ధాంతములు తప్ప మిగతవారు ఎవరు పరిశోధన చేయకపోవడము వలన మిగత నాలుగు శాస్త్రములవలె జ్యోతిష్యశాస్త్రము అభివృద్ధి చెందలేదు. పూర్వము కనుగొన్న కొన్ని సిద్ధాంతములు కూడ పూర్తి స్థాయి సిద్ధాంతములు కాకపోవడము జ్యోతిష్యశాస్త్రములోని పెద్దలోపము. కొన్ని సిద్ధాంతములు సత్యమైనవి నిరూపణకు వచ్చునవి కాగ, కొన్ని సిద్ధాంతములు నిరూపణకు రానివైపోయాయి. అందువలన జ్యోతిష్యశాస్త్రము ప్రకారము చెప్పెడి భవిష్యత్తు కొంత నిజమౌతున్నది, కొంత అసత్యమౌతున్నది. దీనిని బట్టి వాస్తవ విషయాలను చవిచూచిన వారు జ్యోతిష్యము శాస్త్రమని అనుచుండగ, అసత్యములను చవిచూచిన వారు జ్యోతిష్యమును శాస్త్రము కాదు అంటున్నారు. దీనికంతటికి కారణము జ్యోతిష్యశాస్త్రములో సరియైన సిద్ధాంతములు లేకపోవడమేనని చెప్పవచ్చును. ఖగోళశాస్త్రము ఎంతో అభివృద్ధి అయినది పూర్వము ఎందరో ఎన్నో పరిశోధనలు చేసి ఎన్నో సిద్ధాంతములను కనుగొన్నారు. అయినప్పటికి పూర్తి అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చును. ఎందుకనగా నేటికిని ఖగోళశాస్త్రములో క్రొత్త క్రొత్త విషయములను సిద్ధాంతపరముగ తెలుసుకొనుచున్నారు. ఇలాగ ఖగోళశాస్త్రము అభివృద్ధి చెందుతూనే ఉన్నది. ఒక్క ఖగోళశాస్త్రమే కాదు మానవునికి సంబంధించిన ఐదుశాస్త్రములలో ఏ ఒక్క శాస్త్రములోను పూర్తి అభివృద్ధి సాధించలేదు. అలాగే జ్యోతిష్యశాస్త్రములో అభివృద్ధి పరిశోధన అన్నిటికంటే వెనుకబడి ఉన్నది. ఉదాహరణకు ఒక లగ్నమును 9 భాగములుగ విభజించారు. దానినే 7 లక్షల భాగములుగ విభజించినపుడు పూర్తిస్థాయి జ్యోతిష్యశాస్త్రము కాగలదు. జ్యోతిష్యశాస్త్రము మీద పరిశోధనయే చేయకుండ అసలుకు శాస్త్రమే లేదనుట పూర్తి అసమంజసము. మనము గ్రుడ్డివారమై ఎదురుగ ఉన్న వస్తువును లేదనుట ఎంత సత్యమో, మనకు తెలియనంత మాత్రమున జ్యోతిష్యశాస్త్రమే లేదనుట అంతే సత్యమగును. చాలామందికి తెలియని విషయమేమిటంటే వాస్తుశాస్త్రము శాస్త్రమే కాదు. లేని వాస్తుశాస్త్రమును కొందరు కల్పించుకొని చెప్పుచుండగ, ఉన్న జ్యోతిష్యశాస్త్రమును లేదని కొందరు చెప్పుచున్నారు. జ్యోతిష్యశాస్త్ర ప్రకారము కష్టాలుగల వ్యక్తిని చూపిస్తాము, వాస్తు ప్రకారము మంచి ఇంట్లో ఉంచి అతనికి కష్టము రాకుండ మార్చగలరేమో వాస్తు శాస్త్రజ్ఞులు చెప్పగలరా? అట్లు కాక జ్యోతిష్యశాస్త్రము ప్రకారము అదృష్టజాతకుని చూపగలము, అతనికి వాస్తులేని ఇంట్లో ఉంచి సుఖాలు రాకుండ చేయగలరా? జ్యోతిష్యము శాస్త్రము కావున కష్టాలున్న వానిని, సుఖాలున్న వానిని మేము చూపగలము. కాని లేనివాస్తు ప్రకారము మానవుని కష్టసుఖాలను వాస్తు శాస్త్రజ్ఞులు మార్చలేరు. మానవునికి గల ఇళ్ళు అతని జాతకములోనే ఉండునని, మధ్యలో వాస్తు అను కల్పిత శాస్త్రము మార్చలేదని తెలుపుచున్నాము.

ఇట్లు

ఇందూ ధర్మప్రదాత, సంచలనాత్మక రచయిత, త్రైత సిద్ధాంత ఆదికర్త

**శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు**